

ఆర్మీ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు
అస్వస్థతకు గురై మృతిచెందిన ఆర్మీ జవాన్ ఈరేటి మహేష్‌కు జనం కన్నీటి వీడ్కోలు పలికారు. - 10లో



వృత్తి నైపుణ్యానికి 'సమర్థ్'
చేనేత వృత్తి నైపుణ్యానికి కేంద్రం 'సమర్థ్' అమలు చేస్తోందని వీవర్ సర్వీస్ సెంటర్ రాష్ట్ర డైరెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. - 10లో



నలుగురికి గాయాలు
వేర్వేరు చోట్ల శనివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. - 10లో

కిట్టు.. గంజాయి పసిగట్టు!

- ప్రత్యేక కిట్ రూపొందించిన తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో
- యూరిన్ టెస్ట్ ద్వారా రెండు నిమిషాల్లో రిజల్ట్
- జిల్లాకు చేరిన 50 కిట్లు
- ఇటీవల ఐదుగురు అనుమానితులను టెస్ట్ చేయగా ఒకరికి పాజిటివ్



గంజాయి టెస్ట్ కిట్

సూర్యాపేటటౌన్: ప్రస్తుత సమాజంలో యువత ఎక్కువగా గంజాయి, డ్రగ్స్‌కు బానిస అవుతోంది. వీరిని ప్రాథమిక దశలోనే గుర్తించి కాపాడేందుకు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో రూపొందించిన ప్రత్యేక కిట్లను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. జిల్లాకు 50 కిట్లు రాగా.. పట్టణ కేంద్రాల్లోని పలు పోలీస్‌స్టేషన్లలో అందుబాటులో ఉంచారు. గంజాయి తాగిన 45రోజుల తర్వాత కూడా ఈ కిట్ సాయంతో యూరిన్ టెస్ట్ చేసినా తేలిపోతుంది. గతంలో గంజాయి టెస్ట్ చేయాలంటే హైదరాబాద్‌కు తీసుకెళ్లి పరీక్షించాక నాలుగైదు రోజుల సమయం పట్టేది. కానీ ఈ కిట్‌తో రెండు నిమిషాల్లో తెలుస్తుంది. వారం రోజుల క్రితం జిల్లా కేంద్రంలో గంజాయి తాగుతున్న కొంతమంది అనుమానితులను గుర్తించి వారిని ఈ కిట్‌తో పరీక్షించగా.. అందులో ఒకరికి పాజిటివ్‌గా తేలింది. దీంతో అతడిని రిమాండ్‌కు తరలించారు. రెండోసారి కూడా గంజాయి తాగినట్లు తేలితే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసులు చెబుతున్నారు. దీంతో గంజాయి తాగేవారితోపాటు, సరఫరాదారుల్లో వణుకు పుడుతోంది.

గంజాయికి చెక్ పెట్టేందుకు..

పట్టణ కేంద్రంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గంజాయి రవాణా, సేవించడం విచ్చలవిడిగా పెరిగిపోయింది. 2023లో జిల్లా వ్యాప్తంగా 27 కేసులు నమోదు కాగా ఆయా కేసులకు సంబంధించి 70 మంది అరెస్టు చేసి వారి నుంచి 631 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 23 కేసులు నమోదు చేసి 53మందిని అరెస్టు చేసి వారి నుంచి 26కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఇటీవల 43మంది అనుమానితులను పట్టుకొని వారిని విచారించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఇలా ప్రతి రోజు జిల్లాలో ఎక్కడో ఒక చోట గంజాయి విక్రయించే, రవాణా చేసే, వాడే వ్యక్తులు పోలీసులకు పట్టుబడుతూనే ఉన్నారు. శివారు ప్రాంతాలను అడ్డాలుగా చేసుకొని గంజాయి విక్రయిస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు గత కొంత కాలంగా అనేక ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. ఈ నేపథ్యంలో టెస్టింగ్ కిట్ అందుబాటులోకి రావడంతో పాత నేరస్తులు, గంజాయికి అలవాటుపడిన యువతను అదుపులోకి తీసుకొని పరీక్షిస్తున్నారు. పాజిటివ్ వస్తే విచారణ చేసి కీలక సమాచారం రాబడుతున్నారు.

విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు

జిల్లాలో గంజాయిని నిర్మూలించేందుకు పోలీసులు అనేక రకాలుగా చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా ఎక్సైజ్ శాఖతో సమన్వయం చేస్తూ గంజాయితో కలిగే అనర్థాలను వివరిస్తున్నారు. విద్యాసంస్థల్లో యాంటీ నార్కోటిక్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కమిటీల ద్వారా విద్యార్థులు, యువత ఎవరైనా గంజాయిని వాడితే సమాచారం తెలుసుకొని చర్యలు చేపట్టేలా కార్యక్రమాన్ని రూపొందించారు.

ఇలా పరీక్షిస్తారు..

గంజాయి అలవాటు ఉందని ఒక వ్యక్తిపై అనుమానం వస్తే ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తారు. అతడి యూరిన్‌ను గంజాయి టెస్ట్ కిట్‌లో ఉంచి పాజిటివా.. లేక నెగిటివా అని నిర్ధారిస్తారు. వ్యక్తి శరీర దృఢత్వాన్ని బట్టి 45 రోజుల నుంచి మూడు నెలల వ్యవధిలో గంజాయి వాడినప్పటికీ.. పరీక్షల్లో బయటపడుతుంది. దీంతో గంజాయి అలవాటు ఉన్న వారు ఈ పరీక్షల ద్వారా తప్పించుకునే అవకాశం లేదని పోలీసులు చెబుతున్నారు.

గంజాయి తాగిన వారికి పాజిటివ్ వస్తుంది



గంజాయి తాగిన వారి యూరిన్‌ను ఈ కిట్‌తో పరీక్షిస్తే పాజిటివ్ అని చూపిస్తుంది. యువత గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. జిల్లాలో గంజాయిని నిర్మూలించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. గంజాయిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి రవాణా, విక్రయాలపై దృష్టి పెట్టాం. విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.
– సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ, సూర్యాపేట

న్యూస్‌రీల్

ఉన్నతంగా నిలబడాలంటే చదువే మార్గం



విద్యార్థులతో సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట): నేటి సమాజంలో ఉన్నతంగా నిలబడాలంటే చదువు ఒక్కటే మార్గమని, ప్రతి విద్యార్థి చదువుపై శ్రద్ధ వహించాలని సూర్యాపేట జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని బాలసదన్‌ను ఆమె సందర్శించారు. విద్యార్థుల తరగతి గదులు, వంట గది పరిశీలించారు. బాలసదన్‌లో ఉంటున్న విద్యార్థుల కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు సొంత ఖర్చుతో తీసుకువచ్చిన లంచ్ బాక్స్‌లను అందజేశారు. సీనియర్ న్యాయవాది డుపుకు మల్లయ్య విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు వసంత సత్యనారాయణ పిళ్లై, యాదవ్, బొలెల్లిద్దు వెంకటరత్నం, ప్రవీణ్ కుమార్ గౌడ్, వాణి, బాలసదన్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న సత్యనారాయణ పిళ్లై

సూర్యాపేటటౌన్: మహిళా శిశు సంక్షేమ శాఖలోని మహిళా సాధికారత కేంద్రం, డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ఎస్వీ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా చట్టాల ప్రాముఖ్యత, వాటి తీవ్రతను చీఫ్ లీగల్ సర్వీస్ అథారిటీ వసంత సత్యనారాయణ పిళ్లై వివరించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ చైతన్య, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వెంకటరత్నం, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, షీ టీం ఎస్ఐ నీలిమా, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వాణి, అడ్వకేట్ దావుల వీరప్రసాద్, భరోసా లీగల్ కౌన్సిలర్ జ్యోతి, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ వినోద్, సఖి హేమలత, తేజస్విని పాల్గొన్నారు.

పట్టణాల్లో విస్తృత తనిఖీలు

సూర్యాపేట టౌన్: జిల్లాలోని ప్రధాన పట్టణాల్లోని కూడళ్లలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా అనుమతి లేని 156 వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీలను సూర్యాపేట, కోదాడ డీఎస్పీలు పర్యవేక్షించినట్లు తెలిపారు.

గ్రూప్-1 మెయిన్స్ కోచింగ్‌కు దరఖాస్తుల స్వీకరణ

సూర్యాపేటటౌన్ : గ్రూప్ – 1 ప్రిలిమినరీ 2024 పరీక్షలో అర్హత సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు మెయిన్స్ కోసం హైదరాబాద్, హన్మకొండ, ఖమ్మం, జగిత్యాల ఎస్సీ స్టడీ సర్కిళ్లలో ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సూర్యాపేట స్టడీ సర్కిల్ డైరెక్టర్ సీహెచ్.రాములు శనివారం తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సాగర్ జలాశయానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో

నాగార్జునసాగర్ : శ్రీశైలం కుడి, ఎడమ గట్టు విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా సాగర్ జలాశయానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తోంది. కృష్ణా పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది. ఆల్మట్టి నుంచి శ్రీశైలం జలాశయం వరకు కృష్ణానదిలో వరద ఉప్పొంగుతోంది. ఎగువనుంచి వస్తున్న వరదను బట్టి నేడో రేపో శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తే అవకాశం ఉంది. దీంతో శ్రీశైలంలో ముందస్తుగా విద్యుదుత్పాదనతో నాగార్జునసాగర్ జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్‌కు నిత్యం సుమారు 60వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయంలోకి ఐదు టీఎంసీల నీరు వచ్చి చేరుతుండగా రెండు అడుగుల మేర నీటి మట్టం పెరిగింది. ప్రస్తుతం సాగర్ జలాశయం నీటిమట్టం 507.50 అడుగులు (127.4655టీఎంసీలు)గా ఉంది. గరిష్ట స్థాయి నీటిమట్టం 590.00అడుగులు (315.5050టీఎంసీలు) ఎగువనుంచి వరద ఈలాగే 15రోజుల పాటు కొనసాగితే నాగార్జునసాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టానికి చేరుకోనుంది.

బంజారా బతుకమ్మ తీజ్

బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే పండుగ తీజ్. ఏటా ఆషాడ మాసం నుంచి శ్రావణమాసం వరకు గిరిజనులు ఘనంగా జరుపుకునే తీజ్ వేడుకలతో.. ఉమ్మడి జిల్లాల్లోని పలు తండాల్లో సందడి నెలకొంది. పెళ్లికాని యువతులు మొలకలు కట్టి తొమ్మిది రోజుల పాటు ఉదయం, సాయంత్రం పూజలు చేయడం పండుగ ప్రత్యేకత. సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలతో అలరిస్తారు. -10లో



విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

భానుపురి (సూర్యాపేట): ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ వర్మ మాట్లాడుతూ. ప్రభుత్వాలు మారినా పేద విద్యార్థుల స్కాలర్‌షిప్స్ మాత్రం అందడం లేదన్నారు. రాష్ట్రంలో ఆరు సంవత్సరాలుగా రూ.8215.57 కోట్ల స్కాలర్‌షిప్ లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. జిల్లాలో వరుసగా విద్యార్థుల మరణాలు చోటుచేసుకుంటున్నాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు.

పోలీసులు, విద్యార్థుల మధ్య తోపులాట

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన విద్యార్థులు అధికారులు, కలెక్టర్ స్పందించాలని కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు, విద్యార్థులకు తోపులాట చోటు చేసుకుంది. అనంతరం కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి విద్యార్థుల నుండి వినతిపత్రం స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్, ఉపాధ్యక్షులు వినయ్, విష్ణు, తన్వేష్, సహాయ కార్యదర్శి శ్రవణ్, యాతాకుల ప్రవీణ్, సభ్యులు అభి, సుమన్, అనిల్, శ్రవణ్, నవ్య, శృతి, సంధ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

బయోటెక్నాలజీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



సర్టిఫికెట్ అందుకున్న బయో టెక్నాలజీ విద్యార్థులు

- ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి

నల్లగొండ రూరల్ : బయో టెక్నాలజీ రంగంలో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. శనివారం యూనివర్సిటీలో బయో టెక్నాలజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు హైదరాబాద్ కేంద్రంగా అనేక అవకాశాలు ఉన్నాయని, వ్యాపార రంగంలో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రశాంతి, సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రేమ్‌సాగర్, మాధురి, శివరాం పాల్గొన్నారు.

కోదాడ ధరణి ఆపరేటర్ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

భానుపురి (సూర్యాపేట): కోదాడ తహసీల్దారు కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ సిబ్బందిగా పనిచేస్తున్న ధరణి ఆపరేటర్ వెంకయ్యను ఉద్యోగం నుంచి తొలగిస్తూ (టెర్మినేట్) కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కోదాడ మండలం కాపుగల్లుకు చెందిన రైతు వీరపనేని కొండలరావు భూభాగాల పంపిణీ కోసం ధరణి ఆపరేటర్ వెంకయ్య డబ్బులు డిమాండ్ చేయడంతో 'ధరణి ఆపరేటర్ దందా' శీర్షికన సాక్షి దినపత్రికలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ లత స్పందించారు. ఈమేరకు కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణను విచారణకు ఆదేశించారు. వచ్చిన నివేదిక ఆధారంగా వెంకయ్యను ఉద్యోగం నుంచి తొలగించారు.

ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు



ఆర్డీఓలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట): పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ధరణి సమస్యల పరిష్కారంపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో శనివారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ మాడ్యుల్స్ లో దాఖలైన ధరణి దరఖాస్తులను రెండు వారాల్లో పూర్తి చేయాలన్నారు. కోర్టు కేసులు, లోకాయుక్త కేసులో ఉన్న వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సీఎం ప్రజావాణి, జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను పరిశీలించి శాఖల వారీగా పరిష్కరించాలన్నారు. ధరణి దరఖాస్తులను పరిశీలించకుండా తిరస్కరించొద్దని చెప్పారు. ఒక వేళ తిరస్కరిస్తే దానికి గల కారణాలను దరఖాస్తుదారులకు తెలపాలని సూచించారు. గ్రామాల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి ఆర్డీఓ ద్వారా నివేదిక పంపాలని తహసీల్దార్లను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీఓలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, వేణు మాధవ్ రావు, శ్యామ్ సుందర్ రెడ్డి, ఆంజనేయులు, సంఘమిత్ర, హేమమాలి, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని కలిగి ఉండాలి

చివ్వెంల(సూర్యాపేట): విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాన్ని కలిగి ఉండాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం చివ్వెంల మండల పరిధిలోని జి.తిర్మలగిరి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టిక, విద్యార్థుల అభ్యసన తీరును పరిశీలించారు. ముందస్తు అనుమతి లేకుండా పాఠశాలకు గైర్హాజరైన ముగ్గురు ఉపాధ్యాయుల గురించి జిల్లా విద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఏకలవ్య డ్రామాను ఆంగ్లంలో చేసి చూపించగా, తెలుగులో చేసి చూపించాలని కలెక్టర్ అడగడంతో తెలుగులో చేసి చూపించారు. అనంతరం వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం ఉన్న కూరగాయలు చూశారు. పాఠశాల నిర్వహణపై జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎంను అభినందించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శైలజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు

భానుపురి (సూర్యాపేట): ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన ముగ్గురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్, మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ కలెక్టర్ తేజస్ నందలాల్ చర్యలు తీసుకున్నారు. చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరి జెడ్పీహెచ్ఎస్‌ను కలెక్టర్ తనిఖీ చేయగా.. ముగ్గురు ఉపాధ్యాయులు ఎలాంటి అనుమతులు లేకుండా విధులకు గైరాజరైనట్లు గుర్తించారు. దీంతో ఉపాధ్యాయురాలు ఎం.నాగమణిని సస్పెన్షన్ చేయగా, పి జానకి, ఆర్ వెంకటయ్యలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్ నానోతండా, బండ రామారం ఎంపీపీఎస్ పాఠశాలలను డీఈఓ అశోక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పి.సత్యమూర్తి (నానో తండా), వెంకట రాములు (బండ రామారం) ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో వీరిద్దరిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈఓ తెలిపారు.

మూలనపడ్డ స్వీపింగ్ మిషన్



నిరుపయోగంగా మారిన స్వీపింగ్ మిషన్

- రహదారులు, వీధులు శుభ్రం చేసేందుకు రూ.47 లక్షలతో మిషన్ కొనుగోలు
- మరమ్మతులు రావడంతో వృథాగా వదిలేసిన మున్సిపల్ అధికారులు

సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలో స్వీపింగ్ మిషన్ అలంకారప్రాయంగా మారింది. మరమ్మతులకు నోచుకోక ఆరు నెలలుగా వృథాగా పడి ఉంది. అరిగిన బ్రష్‌ల స్థానంలో కొత్తవి అమర్చాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

రూ.47లక్షలు వెచ్చించి కొనుగోలు..

పనుల్లో వేగం పెంచేందుకు రోడ్లను పూర్తిగా శుభ్రం చేసేందుకు అన్ని మున్సిపాలిటీల్లో అదనంగా యంత్రాలను ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో సూర్యాపేట మున్సిపాలిటీకి కూడా స్వీపింగ్ మిషన్ వచ్చింది. రెండేళ్ల క్రితం రూ.47 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఈ మిషన్ బ్రష్‌లు అరిగిపోయాయి. కొత్త బ్రష్‌లు వేసి వినియోగించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. గత ఆరు నెలలుగా వృథాగా ఉంచుతున్నారు. మూలన పడ్డ స్వీపింగ్ మిషన్ వినియోగంలోకి తీసుకురావాలని, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బ్రష్‌లు ఆర్డర్ పెట్టాం

వీధులను శుభ్రపరిచేందుకు స్వీపింగ్ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. బ్రష్‌లు అరిగిపోవడంతో ఆర్డర్ పెట్టాం. రాగానే తిరిగి మిషన్‌ను వినియోగంలోకి తీసుకువస్తాం.
– శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట

పరిశుభ్రతే లక్ష్యంగా..



హుజూర్‌నగర్‌లో డ్రై డేలో భాగంగా కూలర్‌లో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న కమిషనర్, సిబ్బంది



హుజూర్‌నగర్ మున్సిపాలిటీలోని మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్న కమిషనర్

- సీజనల్ వ్యాధుల కట్టడికి కదిలిన యంత్రాంగం
- మున్సిపాలిటీల్లో వారంలో ఒకరోజు డ్రై డే
- ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్న అధికారులు

హుజూర్‌నగర్ : సీజనల్ వ్యాధులు ముసిరే సమయమిది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు మరింత విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని మున్సిపాలిటీల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులు దరిచేరకుండా చేయడమే లక్ష్యంగా మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖలు సంయుక్తంగా నడుంబిగించాయి. ఇందులో భాగంగా ప్రతి వారం ఒక రోజు డ్రై డే పాటించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుత కాలంలో నీటి తొట్టెలు, పూల కుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పలు, వాడి పారేసిన టైర్లు తదితర వాటిలో వర్షపునీరు నిల్వఉండి దోమల లార్వా వృద్ధి చెందే అవకాశం ఉంది. ఈసమస్యను తక్షణం అధిగమించేందుకు ప్రతి ఇంట్లో ఎవరికి వారు స్వతహాగా డ్రై డే పాటించాలని అవగాహన కల్పిస్తున్నారు. అలాగే ఇంటింటికీ తిరిగి అలాంటి చెత్తా చేదారాన్ని శుభ్రం చేయిస్తున్నారు.

కార్మికుల సెలవుల తగ్గింపుపై దృష్టి..

మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికులకు సెలవులను సాధ్యమైనంత వరకు తగ్గించారు. వార్డుల్లో పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా చేపట్టాలని నిర్ణయించారు. మొత్తం కార్మికుల్లో గైర్హాజరు శాతాన్ని 30 శాతం నుంచి 5 శాతానికి తగ్గించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు.

మలేరియా, డెంగీ నివారణ ముఖ్యం

ప్రస్తుత వానాకాలంలో దోమల కారణంగా మలేరియా, డెంగీ కేసులు పెరగ నున్నాయి. ఆడ అనాఫిలిస్ దోమ ద్వారా మలేరియా వ్యాపిస్తుంది. ఈ దోమ ఎక్కువగా మురుగునీటిలో పెరుగుతుంది. మున్సిపాలిటీల్లో మురుగు నీరంతా మడుగులు కట్టి దోమల విజృంభణకు కారణమవుతోంది. వాడి పారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు, చిప్పల్లో నీరు నిల్వ ఉంటోంది, వీటిలో వర్షపు నీరు నిలిచి డెంగీకి కారణమయ్యే దోమ వృద్ధి చెందుతుంది. ఇది కుట్టిన వెంటనే జ్వరం, కండరాల నొప్పులు, వాంతులు, దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటాయి. జ్వరం వచ్చిన వారికి వెంటనే తగిన వైద్యం అందకపోతే రక్తంలో ప్లేట్‌లెట్స్ తగ్గి ప్రాణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం కూడా ఉంది.

దోమల నివారణకు..

దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించారు. మురుగు వాడల్లో కాల్వ పూడిక, వ్యర్థాలను తొలగిస్తున్నారు. మురుగు నీరు నిల్వ ఉన్న గుంతల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నారు. దోమల లార్వాను నియంత్రిస్తున్నారు. మందులు పిచికారీ చేస్తున్నారు. ప్రధాన ప్రాంతాలు, కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. అవసరమైన ప్రదేశాలు, ప్రాంతాల్లో వెంటనే ప్రత్యేకంగా వైద్య, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

మున్సిపాలిటీ	వార్డులు	రోజూ ఉత్పత్తి అవుతున్న చెత్త (మెట్రిక్ టన్నుల్లో..)
సూర్యాపేట	48	61
కోదాడ	35	32
హుజూర్‌నగర్	28	20
తిరుమలగిరి	15	09
నేరేడుచర్ల	15	05

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగం తరపున అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దోమల నియంత్రణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
– కె. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

ఐదు మున్సిపాలిటీల పరిధిలో..

జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో మొత్తం 141 వార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో రోజూ 127 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. వాటిలో కొన్ని మున్సిపాలిటీల్లో కొంత చెత్తను కంపోస్టు తయారీకి, మరికొంత చెత్తను డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అయితే పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడమే కాకుండా వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో మున్సిపల్ కార్మికుడి ఆత్మహత్య

యాదగిరిగుట్ట: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో మున్సిపల్ కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణంలోని గణేష్‌నగర్‌లో నివాసముంటున్న దూడల నర్సింహ(50) యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో పీడబ్ల్యూఎస్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న నర్సింహ శనివారం తెల్లవారుజామున తన ఇంటి ఆవరణలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ వెల్లడించారు. నర్సింహ మృతి పట్ల మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సంతాపం తెలియజేశారు.

ఆటో బోల్తా.. ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడిన శ్రీనివాస్

చివ్వెంల(సూర్యాపేట): రోడ్డుకు అడ్డంగా వచ్చిన గేదెను తప్పించబోయి అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చివ్వెంల మండల కేంద్రం శివారులో సూర్యాపేట–ఖమ్మం రహదారిపై శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట నుంచి చివ్వెంల మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి వెళ్తున్న ఆటో చివ్వెంల మండల కేంద్రం శివారులో సూర్యాపేట–ఖమ్మం రహదారిపై తహసీల్దార్ కార్యాలయం వద్ద గేదె అడ్డురావడంతో దానిని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పులితండా ఆవాసం మల్యాతండాకు చెందిన ధరావతు శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి


జానీ (ఫైల్)

మఠంపల్లి: మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌కే జానీ (36) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామానికి చెందిన జానీ చిలుకూరు మండల కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. ఏడాదిన్నర కాలంగా మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్ల లున్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

కోదాడ: కోదాడ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి నల్లగొండ రీజియన్‌కు చెందిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మైనింగ్, ఆర్టీఏ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 33 వాహనాలను తనిఖీ చేసి రూ.2,80,513 జరిమానా విధించారు. బల్క్ సిమెంట్, లూజ్ సిమెంట్, గ్రానైట్, స్పాంజ్ ఐరన్ రవాణా చేస్తున్న వాహనాలకు సరైన అనుమతులు లేవని గుర్తించారు. అధిక లోడ్‌తో వెళ్తున్న 5 లారీలపై కేసులు నమోదు చేసి రూ.1,94,010 జరిమానా విధించారు. గ్రానైట్ రవాణా చేస్తున్న ఒక లారీకి రూ.45,313, అధిక లోడ్‌తో వెళ్తున్న సిమెంట్, గ్రానైట్ లారీలకు రూ.41,190 జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు 'సమర్థ్'

- వీవర్ సర్వీస్ సెంటర్ రాష్ట్ర డైరెక్టర్ అరుణ్‌కుమార్


సమర్థ్ శిక్షణ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అరుణ్‌కుమార్

భూదాన్‌పోచంపల్లి: చేనేత కళాకారుల్లో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం సమర్థ్ పథకాన్ని అమలు చేస్తోందని వీవర్ సర్వీస్ సెంటర్ రాష్ట్ర డైరెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. శనివారం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని డీఎస్ వీవ్స్‌లో కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, చేనేత అభివృద్ధి కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని వీవర్ సర్వీస్ సెంటర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన సమర్థ్ శిక్షణ కార్యక్రమాన్ని కేంద్ర జౌళిశాఖ మంత్రి పబిత్ర మార్గెరిటా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అరుణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమర్థ్ పథకం ద్వారా వీవింగ్, డిజైనింగ్‌లో చేనేత కార్మికులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దోర్నాల శేషగిరి, ట్రైనర్ భోగ బాలయ్య, అసిస్టెంట్ ట్రైనర్లు గోశిక భానుప్రకాశ్, ఆటిపాముల మహేందర్ పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి న్యాయవాదుల వినతి


సీఎంకు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు, చిత్రంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

చౌటుప్పల్: చౌటుప్పల్‌లో సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి శనివారం హైదరాబాద్‌లోని సీఎం నివాసానికి వెళ్లారు. కోర్టు ఏర్పాటు ఆవశ్యకతను సీఎంకు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. కోర్టు ఏర్పాటు చేయడానికి అవసరమైన నియమాలు, మార్గదర్శకాలు పూర్తిస్థాయిలో అనుకూలంగా ఉన్నాయని రాజగోపాల్‌రెడ్డి సీఎంకు వివరించారు. స్పందించిన సీఎం న్యాయ శాఖ కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడారు. కోర్టు ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ ఎంపీపీలు చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, తాడూరి వెంకట్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ పబ్బు రాజుగౌడ్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు తాడూరి పరమేష్, రాపోలు వేణు, పడమటి మహిపాల్‌రెడ్డి, జెల్ల రమేష్, నర్రి స్వామి, అల్లి స్వాతి, జంపాల శ్రీశైలం, న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, ఎలమోని శ్రీనివాస్, బాల్యం వెంకటాచలపతి, వాకిటి నర్సింహ్మారెడ్డి, పిట్టల భిక్షమయ్య, పరమేష్, మోహన్, నాగరాజు, భిక్షపతి, రవీందర్, రంగారెడ్డి, బడుగు శ్రీకాంత్, ఎండీ ఖయ్యూంపాష తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. భువనగిరి మండలం బాలంపల్లి గ్రామానికి చెందిన కాశపాక రంగయ్య శనివారం ఉదయం తన బంధువుల ఊరైన యాదగిరిగుట్ట మండలం చిన్న కందుకూరు గ్రామానికి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్నాడు. చిన్నకందుకూరు గ్రామ స్టేజీ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా.. గుర్తుతెలియని వాహనం టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో రంగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు రంగయ్య బావ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలియజేశారు.

రెండు మోటారు సైకిళ్లు ఢీకొని..

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణ పరిధిలోని తుక్కాపురం వెళ్లే రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. భువనగిరి పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మౌనిక, షైనీ మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో మోటర్ సైకిల్ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితులు భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి..

కేతేపల్లి: కేతేపల్లి మండల కేంద్రంలోని విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని చంద్రన్నకుంట కాలనీకి చెందిన శాంతం చంద్రం(31) నల్లగొండలోని సబ్‌కోర్టులో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శనివారం బైక్‌పై నల్లగొండకు వచ్చిన చంద్రం తిరిగి సూర్యాపేటకు వెళ్తుండగా మార్గమధ్యలో కేతేపల్లి మండల కేంద్రంలోని నిమ్మలమ్మ చెరువు సమీపంలోకి చేరుకోగానే బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రం తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో 'డయల్ 100' కీలకం

- నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ క్రైం: శాంతిభద్రతల పరిరక్షణలో డయల్ 100 కీలకమని నల్లగొండ ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. శనివారం జిల్లాలోని డీఎస్పీలు, సీఐలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ రాములునాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. డయల్ 100కు వచ్చే ఫోన్ కాల్‌కు వెంటనే స్పందించాలన్నారు. ఆపదలో ఉన్న వారు డయల్ 100కు ఫోన్ చేస్తే పోలీసులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఫోన్ పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైనా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1470 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించినట్లు తెలిపారు. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర పరికరాలు హ్యాక్ కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

మోతె: గుట్కా ప్యాకెట్ల లోడుతో వెళ్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఖమ్మం పట్టణానికి చెందిన చింట నాగరాజు హైదరాబాద్ నుంచి రూ.7లక్షల విలువైన గుట్కా, అంబర్ పాకెట్లను అశోక్ లేల్యాండ్ వాహనంలో ఖమ్మం వైపు తీసుకెళ్తుండగా.. మోతె మండలం సింగరేణిపల్లె టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

బంజారాల సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పే ముఖ్యమైన పండుగల్లో తీజ్ ఒకటి. ఆధునిక యుగంలోనూ బంజారాలు సీత్లా, తీజ్ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. ముఖ్యంగా పెళ్లికాని గిరిజన యువతులు తొమ్మిది రోజుల పాటు జరుపుకునే తీజ్ వేడుకలు తెలంగాణలోని బతుకమ్మ పండుగను పోలి ఉంటాయి. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో పెళ్లికాని గిరిజన యువతులు ఎక్కడ ఉన్నా తండాలకు చేరుకుని తమకు మంచి భర్త రావాలని కోలాహలంగా తీజ్ వేడుకలు చేసుకుంటారు.

సండే స్పెషల్



బంజారా బతుకమ్మ.. తీజ్ పండుగ

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహణ

తొమ్మిది రోజుల పాటు వేడుకలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్), ఆత్మకూర్(ఎస్): గిరిజన తండాల్లో తీజ్ సందడి మొదలైంది. గిరిజనులు(లంబాడాలు) తమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఆషాఢ మాసంలో సీత్లా(దాటుడు) పండుగ, పెళ్లికాని యువతులు తీజ్(మొలకల) వేడుకలు నిర్వహిస్తుంటారు. పెళ్లికాని యువతులు రేగి చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి తీజ్ వేడుకలు ప్రారంభిస్తారు. అంతకుముందే తండాల్లోని పెద్దలు ప్రతి ఇంటి నుంచి గోధుమలు సేకరించి రోజంతా నీళ్లలో నానబెడతారు. పెళ్లికాని యువతులు చిన్నచిన్న వెదురు బుట్టలల్లో పుట్ట మట్టి(మకొడధూడ్), గోవు పిడకల చూర్ణాన్ని కలిపి నాయక్(పూజారి) ఇంటికి తీసుకురాగా నాయక్ భార్య ఆ బుట్టలో నానబెట్టిన గోధుమలు వేసి అలుకుతుంది. అనంతరం పూజలు చేసి బుట్టలను తండాలోని ప్రధాన కూడలి వద్ద వేయించిన డొగ్నో(పందిరి)పై ఉంచి తొమ్మిది రోజుల పాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక జలాలు చల్లుతుంటారు. ఈ సందర్భంగా పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు.

పులియోగెనో ప్రత్యేకం

తీజ్ ఉత్సవాల్లో ముఖ్యమైనది పులియోగెనో. దీనిని బంజారా మహిళలు అద్దాలు, గవ్వలు, పూసలతో స్వయంగా తయారు చేస్తారు. గోధుమలు మొలకెత్తడానికి పవిత్ర జలాలను పోసే సమయంలో దీనిని వినియోగిస్తారు. యువతులు కలశాలతో జలాలను తీసుకొచ్చేటప్పుడు తలపై పెట్టుకొనే దానిని గెనో అని ఆ రెండు కలశాలపై కప్పుకొని వచ్చేదానిని పులియా అని పిలుస్తారు. పెళ్లి సమయంలో దీనిని పెళ్లికూతురుకు తమ గుర్తుగా తల్లిదండ్రులు అందిస్తారు.

ఏడుగురు దేవతలు

లంబాడా తెగ గిరిజనులకు ఏడుగురు స్త్రీ దేవతలు ఉన్నారు. మెరామా, హింగళ, తుల్జాభవాని, కేంకాళి, తీజ్, మత్రాళ్, సీత్లా అనే దేవతలను పూజిస్తారు. మెరామా దేవత తండాను రక్షిస్తే, తీజ్ దేవత పంటలను రక్షిస్తుందని నమ్ముతారు. సీత్లా దేవత పశుసంపదను వృద్ధి చేస్తుదని, మత్రాళ్ దేవత పిల్లలు అంటు వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తుందని విశ్వసిస్తారు.



ఆనవాయితీగా చేసుకుంటున్నాం

సీత్లా, తీజ్ పండుగను ఆనవాయితీగా చేసుకుంటున్నాం. ఆషాఢమాసం వచ్చిందంటే తండాల్లో సందడి నెలకొంటుంది. ఎక్కడెక్కడో ఉండే మా గిరిజన పిల్లలంతా తండాలకు చేరుకుంటారు. ఈ పండుగలు చేస్తేనే మంచి జరుగుతుందని నమ్ముతాం. అమ్మవార్లకు నిష్ఠగా పూజలు చేయడంతోనే కరుణించి మంచి వానలు కురిపిస్తారు. **– గుగులోతు చిలుకమ్మ, జాలుతండా, నూతనకల్ మండలం**


నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు

కోలాహలంగా నిమజ్జనం..

తీజ్ పండుగను గిరిజనులు తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఆయా రోజుల్లో యువతులు రొట్టెలు, ఆకుకూరలు మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. బుట్టలు ఎందరు ఉంచినా అందులో ఐదుగురు యువతులు మాత్రమే నిష్ఠతో పూజ చేస్తారు. చివరిరోజు యువతులు మొలకల బుట్టలను తలపై ఎత్తుకొని చెరువు వద్దకు వెళ్తారు. అప్పటికే అక్కడ సంప్రదాయ పద్ధతిలో రుమాలు తలకు చుట్టకొని పెద్దమనుషులు కూర్చుంటారు. యువతులు బుట్టల్లోని కొన్ని మొలకలను తలపాగలో వేస్తారు. అనంతరం బుట్టలకు పూజలు చేసి చెరువులోకి వదులుతారు. తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత పెద్దమనుషుల కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకుంటారు. యువతులను సైతం పీటలపై కూర్చోబెట్టి పెద్దమనుషులు వారి కాళ్లు కడిగి ఆశీర్వదిస్తారు. తీజ్ ముగింపు వేడుకల్లో పాల్గొనే పెళ్లికాని యువతులు వచ్చే సంవత్సరం తాము తిరిగి తీజ్ ఆడుతామో లేదో అనే భావన వారిలో కనిపిస్తుంది.అంతకు ముందు గ్రామంలో పెళ్లికాని గిరిజన యువకులు చేతుల్లో పట్టుకొనే పీడియాను ప్రయత్నాలు చేస్తూ విడిపిస్తారు. అయితే పీడియాను పట్టుకొన్న వ్యక్తి ఇంటి పేరు విడిపించే వ్యక్తి ఇంటి పేర్లు ఒకటి కాకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.

యాదాద్రీశుడిని దర్శించుకున్న పుదుచ్చేరి హోంమంత్రి


పుదుచ్చేరి హోంమంత్రి దంపతులకు స్వామి చిత్రపటం ఇస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని శనివారం పుదుచ్చేరి హోంశాఖ మంత్రి ఏ. నమశ్శివాయం దంపతులు, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఆచార్యులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయ గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తుల చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు.

డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు.. 11మందిపై కేసు నమోదు

నల్లగొండక్రైం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 11 మందిపై శుక్రవారం రాత్రి నల్లగొండ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టుబడిన మందుబాబులకు శనివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజశేఖర్‌రెడ్డి కౌన్సిలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మనస్తాపంతో ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం


యాగయ్య (ఫైల్)

అర్వపల్లి: భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అర్వపల్లి ఎస్‌ఐ ఎస్‌కే. యాకూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన నిమ్మల యాగయ్య(38) గ్రామంలో మెకానిక్‌గా పనిచేస్తున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన యాగయ్య తన భార్య ఉపేంద్రతో తరచూ గొడవ పడుతుండేవాడు. దీంతో రెండు నెలల కిందట ఉపేంద్ర తన తల్లిగారి ఊరైన మండల పరిధిలోని అడివెంలకు వెళ్లి అక్కడే ఉంటోంది. భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన యాగయ్య శనివారం ఉదయం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి కుమార్తె ఉంది.

ఆర్మీ జవాన్‌కు అంతిమ వీడ్కోలు

- స్వగ్రామంలో ఈరేటి మహేష్ అంత్యక్రియలు పూర్తి
- హాలియా నుంచి మదారిగూడెం వరకు కొనసాగిన అంతిమయాత్ర
- జాతీయ పతాకాలు, మహేష్ చిత్రపటంతో విద్యార్థులు, యువత ర్యాలీ


హాలియాలో నిర్వహించిన మహేష్ అంతిమయాత్ర


మహేష్ తల్లిదండ్రులకు జాతీయ పతాకాన్ని అందజేస్తున్న ఆర్మీ అధికారులు

హాలియా: అసోం రాష్ట్రంలో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తూ అస్వస్థతకు గురై మృతిచెందిన అనుముల మండలం మదారిగూడెం గ్రామానికి చెందిన ఈరేటి మహేష్(24) అంత్యక్రియలు శనివారం పూర్తయ్యాయి. మహేష్ భౌతికకాయాన్ని ఆర్మీ అధికారులు హైదరాబాద్ నుంచి ప్రత్యేక సైనిక వాహనంలో ఉదయం 10.15 గంటలకు హాలియాకు తీసుకువచ్చారు. హాలియా పట్టణం నుంచి మదారిగూడెం వరకు మహేష్ అంతిమయాత్ర కొనసాగింది. దారి పొడవునా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నిలబడి జాతీయ జెండాలు, మహేష్ చిత్రపటం, ఫ్లెక్సీలను ప్రదర్శించారు. యువకులు మహేష్ పార్థివదేహంపై పూలు చల్లుతూ ర్యాలీ నిర్వహించారు. సామాజిక కార్యకర్త అమీర్ అలీ ఆధ్వర్యంలో అంతిమయాత్రలో పాల్గొన్న యువకులు, విద్యార్థులు, ప్రజలకు వాటర్ బాటిల్స్ సరఫరా చేశారు. మదారిగూడెంలోని మహేష్ స్వగృహంలో కొద్దిసేపు అతడి పార్థివదేహాన్ని గ్రామస్తుల సందర్శనార్థం ఉంచారు. బంధువులు, ప్రజలు భారీగా వచ్చి నివాళులర్పించారు. మధ్యాహ్నం 2.55 గంటలకు సైనిక సంప్రదాయ బ్యాండ్‌తో అంతిమ యాత్ర ప్రారంభించారు. అంతిమ యాత్రలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, టీడీపీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వా అరుణ్‌కుమార్, నాయకులు రిక్కల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ యడవెల్లి అనుపమానరేందర్‌రెడ్డి, సీఐ జనార్దన్‌గౌడ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్‌యాదవ్, వెంకటనారాయణరెడ్డి, ఆర్మీ అధికారులు, మాజీ ఆర్మీ అధికారులు తదితరులు పాల్గొన్నా ఉ.3.15 గంటలకు అంతిమయాత్ర అతడి వ్యవసాయ క్షేత్రానికి చేరుకుంది. మహేష్ భౌతికకాయంపై ఉంచిన జాతీయ జెండాను ఆర్మీ అధికారులు అతడి తల్లిదండ్రులకు అందజేశారు. ఆర్మీ అధికారులు గాడ్ ఆఫ్ ఆనర్ పరేడ్ నిర్వహించాక మహేష్ తండ్రి ఈరేటి యాదయ్య తన కుమారుడి చితికి నిప్పంటించి అంత్యక్రియలు పూర్తి చేశారు.


మహేష్ పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న ఆర్మీ జవాన్లు


సంతాప సూచకంగా గాడ్ ఆఫ్ ఆనర్ పరేడ్ చేస్తున్న ఆర్మీ జవాన్లు

టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టిన బొలేరో వాహనం

- ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

కేతేపల్లి: టీవీఎస్ మోపెడ్‌ను వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కేతేపల్లి మండల కేంద్రంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన కందికంటి వెంకన్న(50) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం వెంకన్న అదే గ్రామానికి చెందిన చింత నర్సింహతో కలిసి టీవీఎస్ మోపెడ్‌పై నకిరేకల్‌కు వెళ్లి తిరిగి సాయంత్రం కొత్తపేటకు వెళ్తుండగా.. కేతేపల్లిలోని డీపాల్ పాఠశాల సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న బొలెరో వాహనం వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టీవీఎస్ మోపెడ్‌పై వెనుక కూర్చున్న కందికంటి వెంకన్నకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. వాహనం నడుపుతున్న చింత నర్సింహకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు వెంకన్నకు భార్య, కుమారుడు ఉన్నారు. కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన నర్సింహను 108 వాహనంలో నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెంకన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.